ఎంతరాతి మనసు నీది కొంచెమైన కరుగదే అది
ఎదురుచూసి నీకోసం విసిగిపోతి వేసారితి

౧. మొన్నరాతిరి నన్నుచేరి నీవే నా ప్రాణమని
ఏనాటికి నిను వీడనని బాసలెన్నో చేసావు
ఊసులెన్నో చెప్పావు ఊరడించి వెళ్ళావు
ఇంతలోనే అంతా మఱచి ఏ కాంతను చేరావో

౨. నిన్ను గాక ఏ పడతిని కలనైనా కాననని
నీవే నా గానమని నీవే నా ధ్యానమని
మురళిపై యమునపై ప్రతినలెన్నో చేసావు
వట్టిమాటలు చెప్పి మరల ఏ పంచను చేరావో

౩. జాముపొద్దు దాటిపోయె నీ జాడే తెలియదాయె
నిదురకాచిన నన్ను చూసి కలువరేడే నవ్వినాడే
ఓపలేను ఈ తాపం దాచలేను నా శోకం
చేతులెత్తి మ్రొక్కుతాను యదునందన రావోయి